క్లుప్తంగా

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



సర్పవరం రాజ్యలక్ష్మి ఉద్యానంలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

కాకినాడ రూరల్: సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయం ఎదురుగా ఉన్న రాజ్యలక్ష్మి ఉద్యానం వద్ద ఆంజనేయస్వామి విగ్రహానికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠాపన జరిగిన నేపథ్యంలో సీతారాముల పట్టాభిషేకం, హనుమంతునికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఉదయం నుంచి సాయంత్రం వరకూ హనుమాన్ చాలీసా, సుందరకాండ పారాయణ చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది. గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు పుల్ల చందు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ నాయకుడు గాలిదేవర బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

లాలా లజపతిరాయ్‌కు నివాళి



లాలా లజపతిరాయ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లోని బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో లాలా లజపతిరాయ్ జయంతిని ఆదివారం నిర్వహించారు. లజపతిరాయ్ చిత్రపటానికి డాక్టర్ సువర్ణరాజు, అడబాల రత్నప్రసాద్, రాఘవరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంజాబ్ కేసరిగా లాలా లజపతిరాయ్ స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడానికి గాను విదేశీ వస్తువులను బహిష్కరణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారన్నారు.

ధర్నాలకు అనుమతి ఇవ్వాలి

కాకినాడ సిటీ: కలెక్టరేట్ వద్ద ప్రజల ధర్నాలకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సామాజిక కార్యకర్త దూసర్లపూడి రమణరాజు మూడు రోజులుగా చేస్తున్న నిరాహార దీక్షను విరమింపజేయడానికి జిల్లా అధికారులు చొరవ చూపాలని సీపీఎం రూరల్ మండల కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం వీరు దీక్షా శిబిరానికి వచ్చి మద్దతు ప్రకటించి, డీఎస్పీని కలిసి వినతిపత్రం అందజేశారు. నాయకులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, పెద్దిరెడ్డి రామకృష్ణ, చింతపల్లి అజయ్‌కుమార్ ఉన్నారు.

వచ్చే నెలలో 'పల్లెకు పోదాం'

బోట్‌క్లబ్: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బీజేపీ పల్లెకు పోదాం కార్యక్రమాన్ని జిల్లాలో వచ్చే నెల 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దీనికి జిల్లా ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమా, వత్సవాయ వరాలబాబును కన్వీనర్‌గా, జీలకర్ర సత్తిబాబు, కరెడ్ల దేవిక కో కన్వీనర్లుగా వ్యవహరిస్తారన్నారు. ప్రధాని మోదీ చేపట్టిన పథకాల గురించి ప్రజలకు వివరిస్తామన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్, తుమ్మల పద్మజ, దాట్ల సూర్యనారాయణ రాజు, గట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లక్కేరావు

కొత్తపల్లి: ఉప్పాడ-కోనపాపపేట బీచ్ రోడ్డులో ఆదివారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పొన్నాడకు చెందిన లక్కేరావు మోటారు సైకిల్‌పై కాకినాడ విధులకు వెళుతుండగా అమీనాబాదు శివారు రామన్నపాలెం సమీపంలో ఉప్పాడ నుంచి కోనపాపపేట వైపు వెళుతున్న ఆటో ప్రమాదవశాత్తూ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్కేరావుకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం కాకినాడలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆటో మితిమీరిన వేగంతో వెళ్లడం వల్లనే ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా తమకు ఎటువంటి సమాచారం అందలేదన్నారు.

ఇదే కదా సంక్షేమం

- అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు
- ప్రతి కుటుంబంలోనూ లబ్ధిదారులు
- నాలుగున్నరేళ్ల నుంచి మేలు



లబ్ధిదారులకు వైఎస్సార్ ఆసరా పథకం చెక్కును అందిస్తున్న కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి (ఫైల్)

బోట్‌క్లబ్: పాలకుడు అంటే ప్రజల వెంటే నడిచేవాడు.. వారి కష్టాలు తీర్చేవాడు.. అర్హత ఉంటే అందరికీ పథకాలు అందించేవాడు.. అచ్చం అలానే నాలుగున్నరేళ్ల నుంచి వైఎస్సార్ సీపీ పాలన సాగుతుందని ప్రతి ఇంటా, ప్రతి నోట వినిపించే మాట ఇది. ఎన్నికల ముందు ప్రజా సంకల్ప యాత్రలో జనం కష్టాలు తెలుసుకున్న జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టాక అనేక పథకాలకు రూపకల్పన చేశారు. అక్కడితో ఆగకుండా అందరికీ అవి పారదర్శకంగా అందేలా బాటలు వేశారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ఇంటి ముంగిటకే సంక్షేమం తెచ్చారు. ప్రజారంజక పాలన అందిస్తున్నారు. ఎన్నో పథకాలతో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరిచారు. నాయకులు, అధికారుల చుట్టూ పేదలు తిరగడం కాదు, అతని ముంగిటకే మనం వెళ్లాలని స్ఫూర్తినందిస్తున్నారు. దీంతో సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు అన్నీ బడుగు, బలహీన వర్గాల చెంతకు చేరుతున్నాయి. కాకినాడ నగరంలో సంక్షేమ పథకాలు అందని ఇల్లు లేదనడం అతిశయోక్తి లేదు. కుల మతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా నిజమైన లబ్ధిదారులకు పథకాలు దరిచేరుతున్నాయి. సుమారు ఐదు లక్షలకు పైగా ఉన్న కాకినాడ జనాభాలో సంక్షేమం పరుగులు పెడుతోంది. విశాలమైన రోడ్లు, అందమైన పార్కులు, నిరుపేదలకు అందుబాటులో వైద్య సేవలతోపాటు అన్ని సంక్షేమ పథకాల అమలుతో నగరం ముందుంది. దళారులు లేకుండా నేరుగా లబ్ధిదారులకు ఆయా పథకాలు చేరుతున్నాయి. తద్వారా నిరుపేద కుటుంబాలకు ఆసరాగా మారుతున్నాయి. వైఎస్సార్ పింఛను కానుక, ఆసరా, చేయూత, అమ్మ ఒడి, విద్యాదీవెన ఇలా ఒకటేమిటి అన్ని పథకాల్లో లబ్ధిదారులు ఉన్నారు. ఇవి ఇలా..

నగరంలో ఆయా పథకాల లబ్ధిదారులు

పథకం	లబ్ధిదారులు	సొమ్ము (రూ.కోట్లలో)
వైఎస్సార్ పింఛన్ కానుక	31,136	293.19
వైఎస్సార్ ఆసరా	37,160	648.73
వైఎస్సార్ చేయూత	15,680	94.38
జగనన్న అమ్మఒడి	1,06,881	147.30
జగనన్న విద్యాదీవెన	26,770	17.68
జగనన్న వసతి దీవెన	13,488	12.49
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	5,274	19.40
వైఎస్సార్ వాహనమిత్ర	2,840	8.08
వైఎస్సార్ పెళ్లికానుక	95	0.59
వైఎస్సార్ బీమా	279	4.23
వైఎస్సార్ కాపునేస్తం	3,765	29.43
జగనన్న చేదోడు	1,646	4.77

సంతృప్తికరంగా సేవలు



ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా గడిచిన నాలుగున్నరేళ్లలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయగలిగాం. దాదాపు అన్ని డివిజన్లలో రోడ్లు, డ్రైన్లు, కమ్యూనిటీ హాళ్లు నిర్మించాం. ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు ఫ్లైఓవర్ నిర్మించాం. ఎన్నో సమస్యలు పరిష్కరించాం. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందించాం. అందువల్లే ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లగలుగుతున్నాం. ప్రజా సమస్యల పరిష్కారం పట్ల చిత్తశుద్ధి కలిగిన సీఎం జగన్ సారథ్యంలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నాం.

– ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే, కాకినాడ

కొడుకులా ఆదుకుని..



గతంలో పింఛను డబ్బుల కోసం రోజుల తరబడి ఇబ్బందులు పడాల్సి వచ్చేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వలంటీర్లను నియమించి ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్ సొమ్ము చేతిలో పెడుతున్నారు. పింఛను సొమ్ము కూడా పెంచారు. కొడుకులా మమ్మల్ని ఆదుకుంటున్నాడు.

– యాతం పల్లయ్యమ్మ, పింఛనుదారు, లచ్చిరాజువారి వీధి

సమాజ సేవకు వేదిక లయన్స్ క్లబ్



జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బాదం బాలకృష్ణ, వెంకటరమణ, సత్యవేణి

బాలాజీచెరువు: సమాజ సేవ చేయడానికి లయన్స్ క్లబ్‌లు మంచి వేదికలుగా నిలుస్తాయని లయన్స్ జిల్లా పూర్వపు గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ అన్నారు. స్థానిక సూర్యకళా మందిరంలో ఆదివారం లయన్ రీజినల్ చైర్మన్ మేడిశెట్టి వెంకటరమణ, సతీమణి సత్యవేణి అధ్యక్షతన రీజినల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బాదం బాలకృష్ణ మాట్లాడుతూ ఇటువంటి సమ్మేళనం ద్వారా కొత్తగా సేవా కార్యక్రమాలు, సభ్యత్వాల పెంపు, శాశ్వత ప్రాజెక్టులు వంటి వాటిపై చర్చించడానికి అవకాశం ఉంటుందన్నారు. లయన్స్ ఫౌండేషన్ ద్వారా 30 వేల మందికి డయాబెటిస్ పరీక్షల నిర్వహణతో పాటు 100 అవగాహన కార్యక్రమాల నిర్వహణకు రూ.40 లక్షలు మంజూరు చేశారని, ఈ ప్రాజెక్టు 10 రోజుల్లో ప్రారంభిస్తామన్నారు. అనంతరం ఉత్తమ సేవలకు గాను లయన్స్ క్లబ్ కాకినాడ సంకల్ప్, లయన్స్ క్లబ్ కాకినాడ, లయన్స్ క్లబ్ కాకినాడ ఎలైట్‌లకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఎంవీఆర్ మోహన్‌కుమార్, దంగేటి సతీష్‌తో వివిధ క్లబ్‌లకు చెందిన 300 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న హస్తకళా ప్రదర్శన



ప్రదర్శనలో వస్తువులు కొనుగోలు చేస్తున్న సందర్శకులు

బోట్‌క్లబ్: కళాకారులు తయారు చేసిన కళాత్మక వస్తువులు కొనుగోలు చేసి చేనేత వస్త్రాలు, హస్త కళలను ప్రోత్సహించాలని హస్తకళా ప్రదర్శన మేనేజర్ వై.వెంకటేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక జేఎన్‌టీయూకే ఎదురుగా ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటైన క్రాఫ్ట్ బజార్ ఎగ్జిబిషన్‌లో సుమారు 80 స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ వివిధ కళాకారులు రూపొందించిన వస్తువులు అందుబాటులో ఉన్నాయన్నారు. కలంకారీ శారీస్, వస్త్రాలు, బ్యాంగిల్స్, కలంకారి డ్రెస్ మెటీరియల్స్, ఖాదీ షర్టులు, జైపూర్ బెడ్ షీట్స్, పానిపట్ సోఫా కవర్స్, మైసూర్ పెయింటింగ్స్, టెరికోటా ఐటమ్స్, నాగాలాండ్ డ్రై ఫ్లవర్స్, వన్ గ్రామ్‌గోల్డ్ జ్యూయలరీ, లేడీస్ డ్రెస్ మెటీరియల్స్, ఢిల్లీ రెడీమేడ్ గార్మెంట్స్, లేడీస్ చెప్పల్స్, బెంగాలీ శారీస్, శహరన్పూర్ ఫర్నీచర్, లేడీస్ టాప్స్, హైదరాబాద్ పెరల్స్- శారీస్, ఫిరోజాబాద్ గిఫ్ట్ ఐటమ్స్ లభిస్తాయని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ ఈ ప్రదర్శన ఉంటుందని అన్నారు. సెలవు రోజుల్లోనూ ప్రదర్శన, అమ్మకాలు ఉంటాయన్నారు.

కార్మిక పోరాటాల్లో లెనినిజం



లెనినిజంపై మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ

కాకినాడ సిటీ: ప్రపంచంలో నేడు జరుగుతున్న కార్మిక వర్గ పోరాటాల్లో లెనినిజం ఉందని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ అన్నారు. శనివారం స్థానిక యూటీఎఫ్ హోమ్‌లో రఘుపతి వెంకటరత్నం నాయుడు స్టడీసర్కిల్ ఆధ్వర్యంలో లెనినిజం విశిష్టత– అక్టోబర్ విప్లవం భారతదేశం అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్మిక కర్షక మైత్రి ప్రాధాన్యాన్ని లెనినిజం చాటి చెప్పిందన్నారు. లెనిన్ ప్రసిద్ధ రచన ఏమి చేయాలి కార్యాచరణకు మార్గదర్శిగా ఉందన్నారు. వలస వాదాన్ని ఎదిరిస్తూ ప్రపంచంలో జాతీయ విముక్తి ఉద్యమాలకు అక్టోబర్ విప్లవం గొప్ప స్ఫూర్తిని ఇచ్చిందన్నారు. తొలిసారిగా సంపూర్ణ స్వాతంత్ర్య నినాదం కమ్యూనిస్టు భావజాలం కలిగిన వారే ఇచ్చారని వివరించారు. సదస్సుకు జనవిజ్ఞాన వేదిక నాయకులు జీఎస్‌హెచ్‌పీ వర్మ ఆహ్వానం పలుకగా పెన్షనర్ల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు అధ్యక్షత వహించారు. కేవీవీ నగేష్, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

హరిహర క్షేత్రంలో చోరీకి యత్నం



సీసీ కెమెరాలో నమోదైన దృశ్యాలను పరిశీలిస్తున్న పోలీసులు

సామర్లకోట: స్థానిక ఐదు తూముల వద్ద అన్నపూర్ణా సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి దొంగలు చోరీకి యత్నించారు. బళ్ల మార్కెట్ ఏలేరు కాలువ కాలిబాట వంతెన అవతలి వైపు పిఠాపురం బ్రాంచ్ కెనాల్ మధ్యలో ఈ ఆలయం ఉంది. నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి సుమారు గంట సేపు చోరీకి ప్రయత్నించారు. ఆలయంలో అమ్మవారి నగలను పరిశీలించి అవి రోల్డ్‌గోల్డ్‌గా గుర్తించి వదిలేశారు. హుండీని బయటకు తీసుకువచ్చి పగులగొట్టారు. అర్చకుని మోటారు సైకిల్ బయటకు తీసుకువచ్చి వదలి పరారయ్యారు. ఈ దృశ్యాలు ఆలయంలోని సీసీ కెమెరాలో పోలీసులు గుర్తించారు. హుండీని ఇటీవల లెక్కించడంతో పెద్దగా నగదు ఉండే అవకాశం లేదని కమిటీ సభ్యులు తెలిపారు. ధర్మకర్త పరమానందగిరి స్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు, వేలిముద్ర నిపుణులు సంఘటనా ప్రదేశానికి చేరుకుని వివరాలు సేకరించారు. సీసీ కెమెరాలో చోరీకి జరిగిన ప్రయత్నాలను పోలీసులు రికార్డు చేసుకున్నారు.

అలరించిన గాత్ర కచేరీ



గాత్ర కచేరీ చేస్తున్న జేబీ కీర్తన

బోట్‌క్లబ్: సంగీత విద్వత్సభ సంక్రాంతి సంగీత నృత్యోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్థానిక సూర్యకళా మందిరంలో చెన్నైకి చెందిన జేబీ కీర్తన గాత్ర కచేరీ అలరించింది. మోహన వర్ణంతో ప్రారంభించి, ధన్యాసి రాగంలో గానం చేశారు. వీరికి వయోలిన్‌పై ఎం.రామ్‌చరణ్, మృదంగంపై ఎం.శ్రీధర్, మోర్సింగ్‌పై జి.వెంకటేష్ చక్కని సహకారాన్ని అందించారు. తొలుత ముళ్లపూడి నాగేశ్వరరావు, ఎస్‌వీ రావు జ్యోతి ప్రజ్వలన చేసి గాత్ర కచేరీ ప్రారంభించారు. కళాకారులను సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో విద్వత్సభ కార్యదర్శి వక్కలంక రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కొత్తపల్లి హైస్కూల్‌లో కలిసిన పూర్వ విద్యార్థులు

కొత్తపల్లి: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో 1970 నుంచి 1975 వరకూ చదువుకున్న విద్యార్థులు ఒక్కచోట కలిసి అలనాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువా, పూలమాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. పాఠశాలలో పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఆనందంగా గడిపారు.

వైభవంగా మఖ నక్షత్ర పూజలు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ఆదివారం మఖ నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు బంగారు, వెండి పుష్పాలతో పూజలు చేయగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



మరిడమ్మ వారికి పూజలు చేస్తున్న భక్తులు

కొల్లేటి పాట ఆవిష్కరణ సభకు తరలిరావాలి



పులిమేరులో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రైతు కూలీ సంఘ నేతలు

పెద్దాపురం: కొల్లేటి సరస్సు పరిరక్షణే ధ్యేయంగా అరుణోదయ విమలక్క రచించిన కొల్లేటి పాట ఆవిష్కరణ సభను విజయవంతం చేయాలని పులిమేరులో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం సభ్యులు ఆదివారం కరప్రతాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ ఏలూరులో ఈ నెల 31న విమలక్క పాట ఆవిష్కరణ సభ జరుగుతోందన్నారు. మత్స్యకారులు, పక్షులకు ఆధారమైన కొల్లేటి మంచినీటి సరస్సును భూస్వాములు తమ ఆర్థిక ఎదుగుదలకు వాటుకుంటూ కలుషితం చేస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో అరుణోదయం సాంస్కృతిక సమాఖ్య కొల్లేటి గుండె చప్పుడు పేరుతో దండోరా వేసి చాటడానికి ఒక పాటను విమలక్క రూపొందించారన్నారు. సభకు పర్యావరణ ప్రేమికులు, అభ్యుదయవాదులు, విద్యార్థి, మేధావులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలన్నారు. సంఘ రాష్ట్ర నాయకుడు కొండా దుర్గారావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.రాజబాబు, బి.రమేష్, ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కె.అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

వెచ్చని నేస్తాలు

- ఉన్ని వస్త్రాలకు ఫుల్ డిమాండ్
- కాకినాడ చుట్టుపక్కల అమ్మకాలు
- జోరుగా సాగుతున్న వ్యాపారం



విక్రయానికి సిద్ధంగా ఉన్న ఉన్ని వస్త్రాలు

కాకినాడ సిటీ: ఉన్ని వస్త్రాలు.. చలికాలంలో వెచ్చని నేస్తాలు. చలి నుంచి ఇవి రక్షణ కవచాలు.. అందుకే ప్రజలు స్వెటర్ల కొనుగోలుకు ఆసక్తి చూపుతుంటారు. ఇతర రాష్ట్రాల వ్యాపారులు కాకినాడ నగరం, రూరల్ నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో ప్రత్యేకంగా దుకాణాలు నెలకొల్పారు. వాటిల్లో ఆకర్షణీయమైన డిజైన్లు కలిగిన రంగు రంగుల స్వెటర్లు విక్రయిస్తున్నారు. శీతాకాలం చాలా మందికి ఇష్టమైన సీజన్. ఈ కాలంలో ఉన్ని దుస్తులు వేసుకుని తిరిగే వారెందరో.. నగర పరిసరాల్లో ఇప్పటికీ చలి తీవ్రత అధికంగా ఉంటోంది. దీంతో ప్రజలు స్వెటర్లు, ఉన్నితో తయారు చేసిన దుస్తుల కొనుగోళ్లకు మక్కువ చూపుతున్నారు. ఒడిశా, నేపాల్, ఉత్తరప్రదేశ్, హర్యానా, ఢిల్లీ, రాజస్థాన్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన విక్రయదారులు కాకినాడ నగర, రూరల్ ప్రాంతాల్లో ప్రధాన రహదారుల పక్కన దుకాణాలు ఏర్పాటు చేసి స్వెటర్లు, మంకీ క్యాప్‌లు, శాలువాలు, దుప్పట్లు అమ్ముతున్నారు.

చలి నుంచి రక్షణకు..

నగర, రూరల్ ప్రాంతాల్లో సాయంత్రం ఆరు గంటలకే పొగ మంచు కురవడం ప్రారంభమవుతోంది. రాత్రి 9 గంటలు దాటితే విపరీతమైన చలి ఉంటోంది. తెల్లవారు జామున ఏడెనిమిది గంటల వరకూ పొగ మంచు వీడటం లేదు. నగర ప్రజలతో పాటు గ్రామీణ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వారందరినీ చలి భయపెడుతోంది. దీని నుంచి రక్షణ పొందేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా తెల్లవారుజామున పనిచేసే పాల, కూరగాయల వ్యాపారాలు, పేపర్ బాయ్స్ తదితరులు చలి నుంచి తట్టుకునేందుకు ఉన్ని వస్త్రాలను ధరిస్తున్నారు. కాకినాడ నగరంలో సంతచెరువు, జగన్నాథపురం, గాంధీనగర్, భానుగుడి, గొడారిగుంట, బోట్‌క్లబ్, రూరల్ నియోజకవర్గంలోని తూరంగి, నడకుదురు, కరప, సర్పవరం, రమణయ్యపేట, రాయుడుపాలెం, అచ్చంపేట జంక్షన్ తదితర చోట్ల రోడ్లపై దుకాణాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ పలు రకాల డిజైన్లలో స్వెటర్లు తదితరాలు లభ్యమవుతున్నాయి. ముఖ్యంగా చిన్నారులను ఆకర్షించేలా జంతువుల బొమ్మలతో కూడిన స్వెటర్లు అమ్ముతున్నారు. మహిళలకు ప్రత్యేక స్వెటర్లు కూడా ఉన్నాయి. వీటిని పెద్దలకు రూ. 200 నుంచి రూ. 800 వరకూ, చిన్న పిల్లలకు రూ. 150 నుంచి రూ. 300 వరకూ ధరల్లో విక్రయిస్తున్నారు. చలితో పాటు వర్షాన్ని తట్టుకునేలా టూ ఇన్ వన్ రకాల స్వెటర్లు అందుబాటులో ఉన్నాయి. వీటిని రూ. 600 నుంచి రూ. 1,200 వరకూ అమ్ముతున్నారు.

ఇరవై ఏళ్ల అనుబంధం

ఒడిశా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఢిల్లీ, నేపాల్‌కు చెందిన కొందరికి కాకినాడతో 20 ఏళ్లుగా అనుబంధం ఉంది. చలికాలం మొదలవుతుందంటే చాలు వారంతా నగరానికి వచ్చేస్తున్నారు. మహారాష్ట్ర, రాజస్థాన్, లూధియానా, పంజాబ్ తదితర ప్రాంతాల నుంచి ఉన్ని దుస్తులను తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. ప్రతి ఏడాది నవంబర్ నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకూ వ్యాపారం సాగిస్తున్నారు. తర్వాత తమ స్వస్థలాలకు వెళ్లిపోతున్నారు. ఇందులో చాలా మంది తెలుగు నేర్చుకున్నారు.

మూడు నెలల వ్యాపారం



కాకినాడ నగరానికి వచ్చి మూడు నెలల పాటు ఇక్కడే ఉంటాం. ఉన్ని దుస్తులు అమ్ముకుని ఆ తర్వాత సొంతూరికి వెళ్లిపోతాం. దుస్తులు నాణ్యంగా ఉండటంతో జనం మా దగ్గర కొనుగోలు చేస్తున్నారు. ధరలు అందుబాటులోనే ఉంటాయి. ఇక్కడి ప్రజలు సౌమ్యులు. అందుకే ఈ ఊరంటే ఇష్టం.

– రాజేష్, వ్యాపారి, మధ్యప్రదేశ్

వాగ్గేయకార వైభవంపై సామవేదం ప్రవచనం



వాగ్గేయకార వైభవంపై ప్రవచిస్తున్న సామవేదం షణ్ముఖశర్మ

కాకినాడ రూరల్: ప్రముఖ ప్రవచనకర్త సామవేదం షణ్ముఖశర్మ వాగ్గేయకార వైభవం అనే అంశంపై చేసిన ప్రవచనం ఆకట్టుకుంది. సర్పవరంలోని భవానీ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో పెద్దాడ సూర్యకుమారి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటైన కార్యక్రమంలో షణ్ముఖశర్మ ప్రవచనం చేశారు. రెండు రోజుల పాటు ఆయన ప్రవచనాలు సాగనున్నాయి. తొలుత సర్పవరం జంక్షన్ నుంచి ఆయనను భారీగా ఊరేగింపుగా నీలకంఠేశ్వరస్వామి ఆలయానికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.